ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 15 ఫిబ్రవరి 2025


తొలిసారిగా హైకోర్టు మదురై బెంచ్‌లో

ఇద్దరు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో మొదటి సారిగా ఇద్దరు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం శుక్రవారం జరిగింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ మదురై డివిజన్ బెంచ్‌లో కొన్ని కీలకమైన కేసులపై విచారణ జరపాల్సి ఉండటంతో ఇటీవల పర్మినెంట్ న్యాయమూర్తులుగా నియమితులైన వి.లక్ష్మీనారాయణన్, పి.వడమలై చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ ఇద్దరు న్యాయమూర్తులు సైతం మదురై డివిజన్ బెంచ్‌లోనే ఇప్పటివరకు సేవలందించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని మద్రాసు హైకోర్టు ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర న్యాయమూర్తులు, హైకోర్టు ఉన్నతాధికారులు, న్యాయవాదులు తిలకించారు. హైకోర్టు మదురై డివిజన్ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఇప్పటివరకూ న్యాయమూర్తులు, ఉన్నతాధికారుల పదవీ విరమణ కార్యక్రమాలు, పదోన్నతుల బదలీ సందర్భంగా వీడ్కోలు సభలు మాత్రమే జరిగేవి. మొదటి సారిగా న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారంజరిగింది.


న్యాయమూర్తులు వి.లక్ష్మీనారాయణన్, పి.వడమలై చేత ప్రమాణ స్వీకారం చేయించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్

26న ఈషా కేంద్రానికి అమిత్ షా



ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖా మంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్‌షా ఈ నెల 26న ఒక రోజు రాష్ట్రానికి రానున్నారు. ఆయన కోవై జిల్లా వెలయంగిరి ప్రాంతంలోని ఈషా ఆశ్రమంలో జరిగే శివారాత్రి వేడుకల్లో పాల్గొంటారు. కేంద్రమంత్రి పర్యటన నేపథ్యంలో ఈశా యోగా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు. మహా శివరాత్రి వేడుకల్లో పాల్గొనే ముందు జిల్లా కేంద్రం రామనాథపురంలో కొత్తగా నిర్మించిన బీజేపీ కార్యాలయాన్ని కేంద్రమంత్రి ప్రారంభిస్తారని కమలాలయ వర్గాలు తెలిపాయి. ఇక ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనే అమిత్‌షాకు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టనున్నట్లు బీజేపీ నిర్వాహకులు తెలిపారు.

రాజధాని నగరం చుట్టూ

అభివృద్ధి పథకాలు

● క్రెడాయ్ ఫెయిర్‌-ప్రో సభలో సీఎం



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై చుట్టూ అభివృద్ధి చెందుతున్న తొమ్మిది ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి పథకాలు అమలు చేయనున్నామని, ఆ మేరకు కొత్త టౌన్‌షిప్‌లు నిర్మించనున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. నందంబాక్కం ట్రేడ్‌సెంటర్‌లో శుక్రవారం రియల్ ఎస్టేట్ డెవలపర్లు, పెట్టుబడిదారులు, భాగస్వాములతో కూడిన భారీ క్రెడాయ్ ఫెయిర్‌ప్రో - 2025 పేరుతో ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. ఆ సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిమనిషికి తిండి, బట్ట, ఇల్లు అత్యంత అవసరమని, అందుకే డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడల్లా పట్టణాలను, నగరాల అభివృద్ధికి పలుపథకాలు చేపడుతోందన్నారు. రానున్న 20 యేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పట్టణాలు నగరాలుగా, గ్రామాలు పట్టణాలు మార్పుచెందేలా 10 ప్రాంతీయ సమగ్రాభివృద్ధి పథకాలు అమలు చేయనున్నామని చెప్పారు. కోవై, మదురై, హోసూరు, సేలం, తిరుప్పూరు, తిరుచ్చి, వేలూరు, తిరునల్వేలి సహా 136 నగరాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామని స్టాలిన్ వెల్లడించారు.

9 ప్రాంతాల్లో కొత్త టౌన్‌షిప్‌లు

చెన్నై కార్పొరేషన్ చుట్టూ ఉన్న మీంజూరు, తిరువళ్లూరు, తిరుమళిసై, మహాబలిపురం, చెంగల్పట్టు కాంచీపురం, మరైమలర్‌నగర్, శ్రీపెరుంబుదూరు, పరందూరు ప్రాంతాల్లో కొత్త టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయనున్నామని, ఆ మేరకు ప్రణాళికలుకూడా సిద్ధమవుతున్నాయని స్టాలిన్ ప్రకటించారు. ప్రజలకు గృహ సదుపాయం కల్పించే రియల్‌ఎస్టేట్ సంస్థలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ లైసెన్సులు, అనుమతుల విషయాలలో ఏకగవాక్ష పద్ధతిని అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు కూత్తంబాక్కం బస్‌టెర్మినల్ త్వరలో ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామో అన్బరసన్, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, క్రెడాల్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీధరన్, రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఇళంగోవన్, చెన్నై విభాగం ఛైర్మన్ మహమ్మద్ అలీ, సలహాదారు శివగురునాధన్, సమన్వయకర్త కిరుత్తివాస్, ఎస్‌బీఐ జీఎం పర్మీందర్ సింగ్, జనరల్ మేనేజర్ మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28న పాంబన్‌కు ప్రధాని

● కొత్త వంతెన ప్రారంభించనున్న మోదీ
● ఏర్పాట్లు పరిశీలించిన దక్షిణ రైల్వే జీఎం

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న ప్రధాని నరేంద్రమోదీ రామనాథపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా పాంబన్ వద్ద మండపం, రామేశ్వరం దీవిని కలుపుతూ సముద్రంపై రూ.550 కోట్లతో నిర్మించిన రైలు వంతెనను ఆయన జాతికి అంకితం చేయనున్నారు. ప్రధాని పర్యటనను పురస్కరించుకుని రామేశ్వరం, ధనుష్కోడి తదితర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. వంతెన ప్రారంభోత్సవ ప్రాంతంలో వేదిక నిర్మాణ పనులకు కూడా అధికారులు శ్రీకారం చుట్టారు.

ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్‌ఎన్ సింగ్ ఇతర అధికారులు పాంబన్ కొత్త వంతెనపై తుది విడత పరిశీలన, తనిఖీ నిర్వహించారు. ఈ రైలు వంతెనను ప్రధాని 28న ప్రారంభించనున్నారనే సమాచారం అందటంతో రైల్వే శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర భద్రతా విభాగం ఉన్నతాధికారులు కూడా ఆ రైలు వంతెనను పరిశీలించారు. ఆ వంతెన మధ్యలో ఉన్న హైడ్రాలిక్ లిఫ్టుల పనితీరు కూడా తనిఖీ చేసి జీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.


పాంబన్ రైలు వంతెనను పరిశీలిస్తున్న రైల్వే జనరల్ మేనేజర్ ఆర్‌ఎన్.సింగ్



టీవీకే అధినేత

విజయ్‌కి 'వై' కేటగిరి భద్రత

● కేంద్ర హోంశాఖ ఆదేశం

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత జోసఫ్ విజయ్‌కి 'వై' కేటగిరి భద్రత కల్పించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విజయ్ రాజకీయ పార్టీ ప్రథమ వార్షికోత్సవం ఇటీవలే ముగిసింది. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా విజయ్ రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌ను ప్రత్యేక సలహాదారుడిగా నియమించుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 26వ తేదీ పార్టీ సర్వసభ్యమండలి సమావేశం కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం విజయ్‌కి 'వై' కేటగిరీ భద్రత కల్పించాని నిర్ణయించింది. అంటే ఆయనకు నిత్యం 8 నుంచి 11 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లతో భద్రత కల్పించనున్నారు. అయితే వై కేటగిరి భద్రత రాష్ట్రంలో మాత్రమే వుంటుందని కేంద్రం స్పష్టం చేసింది. ఇదిలా వుండగా రాష్ట్ర వ్యాప్తంగా విజయ్ అభిమానులూ అధికమే. అందువల్ల ఆయన వెళ్లే ప్రాంతాల్లో తొక్కిసలాట జరిగే అవకాశముందన్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అదనపు భద్రత కల్పించనుంది.

ఆ భద్రత ఎందుకో ? అన్నాడీఎంకే

విజయ్‌కి 'వై' కేటగిరి భద్రతపై అన్నాడీఎంకే సీనియర్ నేత కేపీ మునుస్వామి స్పందించారు. పార్టీ అధినేతగా, అభిమానుల తాకిడి వుందన్న ఉద్దేశంతో విజయ్‌కు భద్రత కల్పిస్తే సంతోషమేనని, కానీ రాజకీయ లబ్ధి పొందేందుకు, విజయ్‌ని ప్రసన్నం చేసుకునేందుకు భద్రత కల్పిస్తే మాత్రం సరికాదన్నారు. బీజేపీ గత చరిత్రను పరిశీలిస్తే విజయ్‌కు ఎందుకు భద్రత కల్పించారో ఇట్టే తెలిసిపోతుందని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేఎన్ నెహ్రూ

నగరవాసులకు

మెరుగైన వసతులు

● మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగరప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పురపాలక, పరిపాలనా శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. సచివాలయంలోని మున్సిపల్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఆవడి నాజర్, శివగణేశన్, డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, కడలూరు, విల్లుపురం, కళ్లకుర్చి, వేలూరు, తిరుపత్తూరు, రాణీపేట, తిరువణ్ణామలై జిల్లాలు సహా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, టౌన్ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి మంత్రి నెహ్రూ సంబంధిత శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... గతంలో లేనివిధంగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నగరాల్లో నివశించే ప్రజలకు కనీస వసతులు కల్పిస్తున్నామని, 48 శాతం వున్న నగర జనాభా సంఖ్య ప్రస్తుతం 60 శాతానికి పెరిగిందన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని రకాల వసతులు మెరుగుపరుస్తున్నామన్నారు. నగరాల్లోని మార్కెట్ల వద్ద మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు శుద్ధీకరించిన నీటిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు.


సమావేశానికి హాజరైన ఉన్నతాధికారులు

పుదువైలో రౌడీ సహా

ముగ్గురి దారుణహత్య


హత్య జరిగిన ప్రదేశం (ఇన్‌సెట్‌లో) మృతులు పన్నీర్‌దేవా, రిషి, ఆది (ఫైల్‌ఫొటోలు)

పుదుచ్చేరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుదువైలో రౌడీ షీటర్ అతడు అనుచరులు హత్యకు గురికావడంతో కలకలం రేగింది. పోలీసులు వెల్లడించిన మేరకు వివరాలిలా...

స్థానిక రెయిన్‌బో నగర్ ఏడో క్రాస్ వీధిలోని పాడుబడిన ఇంటి వద్ద ప్రముఖ రౌడీ రిషి, అతడి అనుచరులు పన్నీర్‌దేవా, ఆది దారుణహత్యకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ఇంటి మొండి గోడల వద్ద ఇద్దరు యువకులు వంటి నిండా కత్తిపోట్లతో శవాలుగా పడి ఉండటం, వారి పక్కనే మరో యువకుడు గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెరియకడై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స ఫలించక ఆ యువకుడు మృతి చెందాడు. మొదట స్థానికులు, పోలీసులు హత్యకు గురైన ముగ్గురు యువకులను గుర్తించలేకపోయారు. ఆ తర్వాత ఆ ముగ్గురూ రౌడీ రిషి, అతడి అనుచరులు పన్నీర్‌దేవా, ఆదిగా గుర్తించారు. రిషి పుదుచ్చేరి ఉళవర్‌కరై ప్రాంతానికి చెందిన దాదా దెస్తాన్ కుమారుడని, అతడిపై పలు హత్యకేసులు, హత్యాయత్నం, దారిదోపిడీ కేసులున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దాదా దెస్తాన్ 2008లో జేజే నగర్ ఇంటిలో ఉన్నప్పుడు ప్రత్యర్థులు బాంబులతో, కత్తులతో దాడి చేసి దారుణంగా హతమార్చారని పోలీసులు తెలిపారు. రిషి ప్రత్యర్థులే శుక్రవారం వేకువజామున ఆ పాడుపబడిన ఇంటి వద్ద మద్యం మత్తులో ఉండటం చూసి హతమార్చి ఉంటారని పోలీసులు చెబుతున్నారు. హత్యాస్థలం వద్దకు ఫోరెన్సిక్ నిపుణుల, జాగిలాలను రప్పించి పరిశీలన జరిపారు. డీఐజీ సత్యసుందరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెరియకడై పోలీసులు కేసు నమోదుచేసుకుని హంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా రౌడీ రిషి, అతడి అనుచరులు పన్నీర్‌దేవా, ఆది మృతదేహాలకు కదిర్‌గ్రామం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరుగుతుండగా వారి కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడ గుమికూడారు. పోలీసు గస్తీ లేకపోవడం వల్లే ముగ్గురూ హత్యకు గురయ్యారంటూ కుటుంబీకులు ఆరోపించారు.



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు - ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు


సామూహిక వివాహ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు తదితరులు

మూడు నెలల్లో

గృహిణుల నగదు పథకం విస్తరణ

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు నెలల్లోగా నిరుపేద గృహిణులకు ప్రతినెలా రూ.1000 చొప్పున చెల్లించే కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకాన్ని విస్తరింపజేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చెన్నై జిల్లా పరిధిలోని ఆలయాల తరఫున 30 జంటలకు సామూహిక వివాహం రాజా అన్నామలైపురంలోని కర్పగాంబాళ్ కల్యాణమండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ ప్రేమికుల దినం రోజున తన చేతుల మీదుగా 30 జంటలకు వివాహాలు జరిపించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రేమికుల దినమంటేనే ఓ పార్టీ నేతలకు మంట పుడుతుందని, వివాహితులంతా రోజూ సంతోషంగా ఉంటే వారికి రోజూ ప్రేమికుల దినమేనన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళాభ్యుదయానికి ప్రాధాన్యత ఇవ్వటం వల్లే రాష్ట్రమంతటా డీఎంకే పాలనకు ప్రజాదరణ పెరుగుతోందన్నారు.

కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకాన్ని ప్రస్తుతం 1.15 కోట్ల మందికి అమలు చేస్తున్నామని, వచ్చే మూడు నెలల్లో ఈ పథకాన్ని విస్తరింపజేయనున్నామని, దీనితో గృహిణుల జీవితాలు సుఖంగా ఉంటాయని ఉదయనిధి అన్నారు. ఈ వివాహ కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్ బాబు, ఎం.సుబ్రమణ్యం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యేలు డి.వేలు, తాయగం కవి, వెట్రి అళగన్, జోసెఫ్ సామువేల్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

6 నుంచి 'సెట్'

పెరంబూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) ద్వారా రాష్ట్ర అర్హత పరీక్ష (సెట్) మార్చి 6,7,8,9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఆన్‌లైన్ (సీబీటీ) ద్వారా నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ తెలిపారు. ఈ విషయమై మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... టీఆర్బీ ఆధ్వర్యంలో రాష్ట్ర అర్హత పరీక్ష నిర్వహించనుందని తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష తేదీకి వారం రోజులు ముందుగాhttp://www.trb.tn.gov.in అనే వెబ్‌సైట్‌నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

దూరవిద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయంలో దూరవిద్య కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ అప్లికేషన్ తదితర కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చు. మరిన్ని వివరాలు, దరఖాస్తు సమర్పణకు http://online.ideunom.ac.in అనే వెబ్‌సైట్‌లో చూడాలని విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

19న అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు కౌన్సెలింగ్

అడయార్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ అకౌంట్స్ ఆఫీసర్, లా ఆఫీసర్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల పేర్లను "www.tnpsc.gov.in' అనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్టు టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాల్ సుందరరాజ్ వెల్లడించారు. అలాగే, ఎంపికైన అభ్యర్థులకు కూడా ఎస్ఎంఎస్ పంపినట్టు పేర్కొన్నారు. కేటాయించిన సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారికి మరో అవకాశం ఇవ్వరని, కౌన్సెలింగ్‌కు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునుంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల వివరాలిలా వున్నాయి...

అంబత్తూర్: చిన్న కాలనీ, పెద్ద కాలనీ, పీకేఎం రోడ్డు, ప్రిన్స్ అపార్ట్‌మెంట్, గణేశ్ వీధి, నాగేశ్వర 3వ క్రాస్ వీధి,

ఈస్ట్ మొగప్పేర్: శ్రీనివాసా నగర్, బాగియత్తమ్మాళ్ నగర్, పెరియార్ మెయిన్‌రోడ్డు, ఒలింపిక్ కాలనీ, అక్షయ కాలనీ, కామరాజర్ వీధి, మోహన్‌రాం నగర్, భారతిదాసన్ నగర్, కొంగునగర్, వీజీపీ నగర్, పన్నీర్ నగర్.

రెడ్‌హిల్స్: ఎంజీఆర్ నగర్, ముత్తుమారియమ్మన్ వీధి, ఆశైతంబి వీధి, మూవేందర్ వీధి, సర్చ్ వీధి, కామరాజర్ నగర్, నేతాజీ నగర్, ఆలమరం ప్రాంతం. గాంధీనగర్

కొనసాగుతున్న సామ్‌సంగ్ కార్మికుల ధర్నా

పెరంబూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సామ్‌సంగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 10వ రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. సామ్‌సంగ్ కార్మికులు జరిపిన నెల రోజుల పోరాటంతో, కర్మాగారంలో సీఐటీయూ కార్మిక సంఘం ఏర్పాటుకు సామ్‌సంగ్ యాజమాన్యం అంగీకరించింది. ఈ నేపథ్యంలో, కార్మిక సంఘంలో చురుగ్గా పనిచేస్తున్న ముగ్గురిని ఇటీవల సస్పెండ్ చేసింది. ఆ ముగ్గురిని విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్‌తో కార్మికుల ధర్నా చేపట్టారు. కాగా, ధర్నా విరమింపుపై శుక్రవారం కార్మిక సంఘం ప్రతినిధులతో సామ్‌సంగ్ యాజమాన్యం జరిపిన చర్చలు విఫలం కావడంతో, ధర్నా కొనసాగిస్తామని కార్మిక సంఘం నేతలు ప్రకటించారు.

వాగులోనే నిలబడి ఆడ ఏనుగు మృతి

టి.నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై సమీపం మానాంపల్లి వద్దనున్న వాగులో మూడు రోజులపాటు కదలకుండా నిలిచిన ఆడ ఏనుగు మృతి చెందింది. మూడు రోజులకు ముందు అటవీశాఖ అధికారులు వాగులో నిలిచిన ఏనుగు దగ్గరకు వెళ్ళి పరీక్షలు జరిపారు. ఆ ఏనుగు కడుపు వద్ద పెద్ద గాయం ఉండటాన్ని గమనించారు. ఆ తర్వాత ఆ గాయం త్వరగా నయం కావటానికి మందులు కలిపిన పండ్లను, ఆహారాన్ని తినిపించారు. గురువారం ఉదయం ఆ ఏనుగును వాగులో నుండి బయటకు రప్పించేందుకు కుంకీ ఏనుగును రప్పించారు. అయినా కుంకీ ఏనుగు వాగునీటిలో నిలిచి ఉన్న ఏనుగు వద్దకు వెళ్లటానికి తటపటాయించింది. చివరకు గురువారం మధ్యాహ్నం వాగులో ఏనుగు ఉన్నట్టుండి నీటిలో ఒరిగి పడింది. వెంటనే అటవీ శాఖ అధికారులు దగ్గరగా వెళ్ళి చూసినప్పుడు ఆ ఏనుగు మృతి చెందిందని తెలుసుకున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ గిరిధరన్ మాట్లాడుతూ వాగులో చనిపోయినది ఆడ ఏనుగు అని, మగ ఏనుగుతో సంపర్కం చేస్తున్నప్పుడు కడుపు చీలి గాయం కావటం నొప్పిని భరించలేక దగ్గరగా ఉన్న ఆ వాగులో మూడు రోజులుగా కదలకుండా నిలిచి చివరకు బాధను తట్టుకోలేక ప్రాణాలు విడిచిందని తెలిపారు.

వైభవంగా మాసాని అమ్మన్
అగ్నిగుండ ప్రవేశ వేడుకలు



అగ్నిగుండంలో నడుస్తున్న ఆలయ ప్రధాన పూజారి, భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి సమీపం ఆనమలైలో మాసాని అమ్మన్ అగ్ని గుండ ప్రవేశ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలు జనవరి 27న ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలలో కీలకఘట్టమైన శ్మశాన కొల్ల కార్యక్రమం ఈ నెల 11 రాత్రి ఆళియార్ట్రంకరై వద్ద జరిగింది. గురువారం చిత్తిర రథోత్సవం జరిగిన అనంతరం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆలయ నిర్వాహకులు అగ్ని గుండం సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామపెద్దలు కర్పూర హారతినిచ్చి మంట వెలిగించారు. శుక్రవారం వేకువజామున రెండు వారాలకు పైగా వ్రత దీక్షలో ఉన్న వేలాదిమంది భక్తులు అమ్మవారిని కీర్తిస్తూ అగ్ని గుండం తొక్కారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు అగ్నిగుండంలో నడుచుకుంటూ వెళ్ళారు. ఆ తర్వాత అగ్నిగుండంపై మల్లెపూలు చల్లి అమ్మవారి అనుమతి పొందిన మీద భక్తులను అగ్నిగుండంలో దిగేందుకు ప్రధాన పూజారి అనుమతించారు. ఆ సందర్భంగా అగ్నిగుండం నలువైపులా అగ్నిమాపకదళం, వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.. ఈ వేడుకలను తిలకించేందుకు తిరుప్పూరు, దిండుగల్, ఈరోడ్ తదితర జిల్లాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బస్ కండక్టర్ల ఎంపికలో మహిళలకు నిబంధనల సడలింపు

టి.నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థల్లో మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఆ మేరకు రవాణా సంస్థలలో కండక్టర్ పోస్టులకు దరఖాస్తున్న చేసుకున్న మహిళల ఎత్తు 160 సెం.మీ నుండి 150 సెంటీమీటర్లకు తగ్గిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఎత్తు సడలింపువల్ల మహిళలు అధికంగా కండక్టర్లుగా నియమితులయ్యే అవకాశముందని రవాణా సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు.

లాడ్జీలో మత్తు ఇంజెక్షన్ల స్వాధీనం

● ఐదుగురి అరెస్టు



చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో మెతాపెట్టామైన్ అనే మత్తు ఇంజెక్షన్లతో ఉన్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రైల్వేస్టేషన్ ప్రాంతంలో మత్తుమందు సూదులు విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆ లాడ్జిలో ఆకస్మిక తనిఖీలు జరిపి 25 మత్తుమందు సూదులను స్వాధీనం చేసుకున్నారు. ఆ సందర్భంగా దినేష్‌కుమార్ (43), అశోక్ (32), రాజవేలు (29), మణికంఠన్ (23) సతీష్‌కుమార్ (27) అనే ఐదుగురిని అరెస్టు చేశారు.

ఆవడి ఫ్యాక్టరీకి బాంబు బెదిరింపు

పెరంబూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడిలో యుద్ధ ట్యాంకులు తయారుచేసే కర్మాగారానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపుపై కర్మాగారం అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు అధికారులు, సిబ్బందిని బయటకు పంపించి కర్మాగారం, ప్రాంగణాలన్నీ తనిఖీ చేసి, బాంబు బెదిరింపు ఫేక్‌గా గుర్తించారు. బాంబు బెదిరింపు వచ్చిన ఈ-మెయిల్ చిరునామా కోసం సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు.

పెళ్లిమండపంలో చేతివాటం

● చదివింపుల సొమ్ము రూ.4.5 లక్షల చోరీ

టి.నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరులోని ఓ కల్యాణమండపంలో వేళచ్చేరికి చెందిన ఆకాష్ అనే వ్యక్తి సోదరి వివాహ వేడుకల సందర్భంగా వచ్చిన చదివింపుల సొమ్ము రూ.4.5లక్షలను చోరీ చేసిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆ వివాహవేడుకలు ముగిసిన తర్వాత చదివింపులుగా వచ్చిన నగదును ఓ సంచిలో పెట్టి ఓ గదిలో ఉంచారు. ఆ తర్వాత వధూవరులతో బంధువులు ఫొటోలు తీసుకుంటున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆ సంచిని అపహరించుకుని ఉడాయించారు. మండపాన్ని ఖాళీ చేసే సమయంలో చదింపుల సొమ్ముకోసం వెతికినప్పుడు చోరీకి గురైనట్లు తెలుసుకుని ఇరువైపు కుటుంబీకులు దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఎగ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ కల్యాణమండపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి సొమ్మున్న సంచిని ఇద్దరు వ్యక్తులు తీసుకువెళ్లడం గుర్తించారు. ఆ వీడియో ఆధారంగా ఆ దొంగల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

తేనిలో రోడ్డు ప్రమాదం

● ముగ్గురి దుర్మరణం

టి.నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తేని సమీపం మధురాపురి ప్రాంతంలో దిండుగల్ - కుమిళి జాతీయ రహదారిలో శుక్రవారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. 20మందికి పైగా మహిళలు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సేలం జిల్లాకు చెందిన సుమారు 40 మంది ఓ ప్రైవేటు బస్సులో శబరిమలై వెళ్తుండగా ఎదురుగా శబరిమల నుంచి వచ్చిన కర్ణాటక రిజిస్ట్రేషన్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్, పదేళ్ల బాలుడు సహా ముగ్గురు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మరణించారు. 20 మందికిపైగా మహిళలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తేని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

కాలువలో బాతుల కళేబరాలు

టి.నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలో నాగరాజకండ్రిగ వద్ద ఓ నీటి కాలువలో వందకు పైగా బాతుల కళేబరాలను చూసి స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. బర్డ్ ఫ్లూ కారణంగా ఆ బాతులు చనిపోయి ఉంటాయని అనుమానిస్తున్నారు. నీటిలో బాతులు నిర్జీవంగా పడి ఉండటంతో కిలోమీటరు దూరం వరకు దుర్వాసన వ్యాపించింది. ఈ సమాచారం తెలుసుకున్న వెటర్నరీ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి బాతుల కళేబరాలను గోయి తవ్వించి పూడ్చిపెట్టారు. ఈ బాతుల కళేబరాలను ఆంధ్రా నుంచి లారీలో తీసుకొచ్చి ఆ కాలువలో పడేసి వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రస్తుతం బర్డ్ ఫ్లూ వ్యాపించడంతో ఆ బాతులు మృతి చెంది ఉంటాయని కూడా అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై ఆరంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ కాలువకు చేరువగా ఉన్న ఫ్యాక్టరీ వద్దనున్న సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ సంఘటనకు కారణమైన దుండగులను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

నగరంలో వేల్‌యాత్రకు హైకోర్టు 'నో'

● వివాదం సృష్టించవద్దంటూ పిటిషనర్‌కు మందలింపు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుప్పరంకుండ్రం పర్వతాన్ని పరిరక్షించే నిమిత్తం నగరంలో భారత్ హిందూ మున్నాని ఆధ్వర్యంలో వేల్ యాత్ర నిర్వహించేందుకు హైకోర్టు అనుమతినిచ్చే ప్రసక్తేలేదంటూ స్పష్టం చేసింది. అంతటితో ఆగకుండా తిరుప్పరంకుండ్రంపై అనవసరమైన వివాదాలు, సమస్యలు సృష్టించడానికి ప్రయత్నించవద్దంటూ పిటిషనర్‌ను తీవ్రంగా మందలించింది. భారత్ హిందూ మున్నాని సంస్థ నార్త్ చెన్నై జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు యువరాజ్ హైకోర్టులో ఓ పిటిషన్ వేశారు. తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ కొలువైన తిరుప్పరంకుండ్రం పర్వతంపై సికిందర్ దర్గా ఉందనే సాకుతో ముస్లింలు ఆ పర్వతం తమకే చెందుతుందని వాదిస్తున్నారని, వారి చర్యలను ఖండిస్తూ చెన్నైలో శూలాయుధాలతో వేల్ యాత్ర జరపడానికి అనుమతినిచ్చేలా పోలీసు శాఖను ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఆ పిటిషన్ ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి జీకే ఇలంతిరయన్ ఎదుట విచారణకు వచ్చినప్పుడు ప్రభుత్వ తరఫు న్యాయవాది హాజరై ఇదివరకే తిరుప్పరంకుండ్రం హక్కులకు సంబంధించిన వివాదం ప్రివ్యూ కౌన్సిల్ వరకు వెళ్ళి, ఆ పర్వతంపైని సికిందర్‌దర్గా, పతాకస్తంభం, కొండమీది రహదారి, నెల్లితోప్పు ముస్లింలకు చెందినవని తీర్మానించారని, అలాంటప్పుడు కొత్తగా ఓ వివాదాన్ని సృష్టించడం భావ్యం కాదన్నారు. ఇదే విషయంపై పిటిషనర్ తరఫు సంస్థ నిర్వాహకులంతా మదురైలో భారీ ర్యాలీ కూడా జరిపారని, మళ్ళీ అదే సమస్యతో రాజధాని నగరంలో వేల్‌యాత్ర నిర్వహించడం భావ్యం కాదన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆ పిటిషన్ మళ్ళీ విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా న్యాయమూర్తి జీకే ఇలంతిరయన్ మాట్లాడుతూ తిరుప్పరంకుండ్రం సమస్యకు చెన్నై నగరానికి ఉన్న సంబంధం ఏమిటని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించారు. తిరుప్పరంకుండ్రంపై మళ్ళీ అనవసరమైన వివాదాన్ని సమస్యలను రేకెత్తించడానికే పిటిషనర్ ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోందని, కనుక చెన్నై నగరంలో వేల్ యాత్ర నిర్వహించేందుకు అనుమతి నిరాకరిస్తున్నట్లు తెలిపి, పిటిషన్‌ను తోసిపుచ్చారు.

బస్సు డ్రైవర్‌కు ఛాతీనొప్పి

● ప్రయాణికులకు తప్పిన ముప్పు

అడయార్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి నుంచి గురువారం రాత్రి చెన్నై బయలుదేరిన ప్రైవేటు బస్సు డ్రైవరుకు మార్గమధ్యంలో ఛాతి నొప్పి వచ్చింది. దీంతో ఆయన బస్సును డివైడర్‌కు ఢీకొట్టి ఆపాడు. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సులోని 40 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నెల్లై నుంచి 40 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సుకు తూత్తుక్కుడి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన కన్నన్ (48) డ్రైవర్‌గా ఉన్నారు. శుక్రవారం వేకువజామున 4 గంటల సమయంలో ఈ బస్సు విరాలిమలై - తిరుచ్చి జాతీయ రహదారిలో వస్తుండగా ఉన్నట్టుండి కన్నన్‌కు ఛాతీలో నొప్పివచ్చింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును చాకచక్యంగా సెంటర్ మీడియాను ఢీకొట్టించి నిలిపివేశారు. ఆ తర్వాత కన్నన్‌ను 108 అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి డ్రైవర్ చనిపోయినట్టు నిర్ధారించారు. ఆ తర్వాత మరో బస్సులో ప్రయాణికులను చెన్నై పంపించారు.

గేటు మీద పడి చిన్నారి మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంగనల్లూరు ఎంఎంటీసీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ గేటు విరిగిపడి ఏడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఎంఎంటీసీ కాలనీలో నివశిస్తున్న సంపత్ అదే ప్రాంతంలో సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఆయన రెండో కుమార్తె ఐశ్వర్యను సంపత్ ప్రతిరోజూ స్కూలుకు తీసుకెళ్లి, తిరిగి తెచ్చేవాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం పాఠశాలకు వెళ్లిన సంపత్ తన కుమార్తెను బైక్‌పై ఇంటికి తెచ్చాడు. కుమార్తెను దింపి, బైక్ పార్క్ చేస్తుండగా, అనూహ్యంగా ఇనుపగేటు ఐశ్వర్యపై పడింది. ఐశ్వర్య తల పగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

యువతి ఆత్మహత్య కేసులో ఇద్దరికి శిక్ష రద్దు

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ముక్కోణపు ప్రేమ వ్యవహారంలో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో జైలు శిక్షపడిన యువకులకు విముక్తి కల్పిస్తూ మద్రాస్ హైకోర్టు తీర్పునిచ్చింది. వివరాలిలా వున్నాయి... చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కొళత్తూర్‌కు చెందిన ఏళుమలై కుమార్తె సుమిత్ర (19), పదేళ్లక్రితం ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదివేది. ఆమె బంధువు ఆనందన్ కూడా అదే కళాశాలలో చదువుకున్నాడు. వీరిద్దరూ ప్రేమించుకుని పెద్దల సమక్షంలో వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సుమిత్ర పొరుగింటిలో వున్న ఇళయరాజా ఆమెపై మనసుపడ్డాడు. అయితే ఆమె అతడి ప్రేమను తిరస్కరించి ఆనందన్‌ను వివాహం చేసుకుంది. అయినా ఇళయరాజా తనను ప్రేమించాల్సిందేనని ఆమె వెంటబడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన సుమిత్ర తన గదిలో ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఇళయరాజా, ఆనందన్‌లను అరెస్టు చేశారు. వారిని చెంగల్పట్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి ఎళిలరసి సమక్షంలో జరిగిన కేసు విచారణ పూర్తయింది. సుమిత్ర ఆత్మహత్యకు గల సహేతుకమైన కారణాలను పోలీసులు కోర్టు ముందుంచలేకదని అభిప్రాయపడిన న్యాయమూర్తి.. ఆ యువకులిద్దరినీ విడుదల చేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు.

మరమగ్గాల కార్మికుల ఆందోళన

● పవర్‌లూమ్‌లపై నల్లజెండాలు ఎగరేసి నిరసన



పవర్‌లూమ్ వద్ద కార్మికులు కట్టిన నల్లజెండా - నిరసనలో పాల్గొన్న కార్మికులు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని కోరుతూ తిరుప్పూరు, కోయంబత్తూరు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం పవర్‌లూమ్ కార్మికులు నిరసనలకు దిగారు. పవర్‌లూమ్‌లపై నల్లజెండాలు ఎగురవేశారు. ఈ రెండు జిల్లాల్లో 2.5లక్షలకు పైగా పవర్‌లూమ్‌ల్లో సుమారు ఐదు లక్షలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేతనాల పెంపునకు సంబంధించి జౌళి ఉత్పత్తిదారులు కార్మిక సంఘాలతో చర్చలకు రాకపోవటంతో కార్మికులు అన్ని ఫవర్‌లూమ్‌ల ఎదుగ ధర్నాలు జరిపారు.

ఇంటి కోసం డబ్బులివ్వలేదనే ఆరోపణలు

● ఏకపక్షంగా విచారణ జరిపారు

● జీసీ మహేష్ కుమార్ సతీమణి

అడయార్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తన భర్తపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన మహిళా కానిస్టేబుల్ ఇంటి నిర్మాణం కోసం రూ.25 లక్షలు అడిగారని, ఆ డబ్బు ఇవ్వకపోవడంతోనే ఈ తరహా ఆరోపణలు చేశారని సస్పెండ్‌కు గురైన ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ మహేష్ కుమార్ సతీమణి అనురాధ ఆరోపించారు. మహిళా కానిస్టేబుళ్ళపై వచ్చే లైంగిక ఆరోపణలు విచారణకు డీజీపీ శంకర్ జీవాల్ నియమించిన విశాఖ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మహేష్ కుమార్‌ను గురువారం డీజీపీ సస్పెండ్ చేశారు. ఇది రాష్ట్ర పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదే అంశంపై అనురాధ శుక్రవారం తాంబరంలో మీడియాతో మాట్లాడుతూ, లైంగిక ఆరోపణలు చేసిన ఓ లేడీ కానిస్టేబుల్‌కు తన భర్తకు వివాహేతర సంబంధం ఉందని చెబుతున్నారన్నారు. నిజానికి ఈ ఆరోపణలు చేసిన మహిళా కానిస్టేబుల్ నగర శివారు ప్రాంతమైన మరైమలర్ నగర్‌లో ఇంటి నిర్మాణం చేపట్టగా, ఇందుకోసం రూ.25 లక్షలు అడిగిందని, ఈ డబ్బు ఇవ్వకపోవడంతో తమ కుటుంబ పరువును బజారుకీడ్చేందుకే ఈ ఆరోపణలు చేశారని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా తమ పెళ్ళి రోజునే తన భర్తను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఈ ఆరోపణలపై ఒక వైపు మాత్రమే విచారణ జరిపి చర్యలు తీసుకున్నారని, రెండు వైపులా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తాను అసిస్టెంట్ కమిషనరుగా ఉన్న సమయంలో తాము ప్రేమించి పెళ్ళి చేసుకున్నామని, ఇపుడు తాను సర్వీసులో లేనని ఆమె ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

జిల్లా కోర్టు ద్వితీయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు

తిరుత్తణి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టులో జిల్లా సివిల్ కోర్టు, క్రిమినల్ కోర్టు ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. న్యాయమూర్తి ధరణిధరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విప్ పీఎం.నరసింహన్, సీనియర్ అడ్వకేట్లు కేఎస్ బాలసుబ్రమణ్యం, ఎసీ అన్బళగన్, ఏ.గోపాల్, అడ్వకేట్ సంఘం అధ్యక్షురాలు జ్ఞానసౌందరి, కార్యదర్శి రాజా తదితరులు పాల్గొన్నారు.

కులం.. అభివృద్ధికి ఆటంకం

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చీల్చి తారతమ్యాలకు దోహదపడుతున్న కులం అభివృద్ధికి అడ్డంగా ఉందని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. కోవై ఆవల్‌పట్టిలో ఉన్న ఓ ఆలయానికి నిర్దేశిత కులానికి చెందిన వారిని ట్రస్టీలుగా నియమించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు... అల్లర్లు సృష్టించే కులం అభివృద్ధికి వ్యతిరేకం. సమాజాన్ని చీల్చి, తారతమ్యాలకు దోహదపడుతున్న కులం అభివృద్ధికి ఆటంకం. కులాన్ని శాశ్వతం చేయాలనే కోరిక రాజ్యాంగ విధానానికి వ్యతిరేకం. కులాన్ని కొనసాగించే దేనినీ న్యాయస్థానం పరిశీలించదు. కులం అనే అనవసరపు భారానికి సమాజంలో కొన్ని వర్గాలు ఇంకా వీటి కింద చావలేదు అంటూ హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది.

గిండి-ఒట్టియంబాక్కం మధ్య విద్యుత్ మార్గం పనులు

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి-ఒట్టియంబాక్కం ప్రాంతాల మధ్య 32 కి.మీ మేర రూ.718 కోట్లతో చేపట్టిన విద్యుత్ మార్గం పనులను తమిళనాడు విద్యుత్‌బోర్డు చైర్మన్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ శుక్రవారం మేడవాక్కం జంక్షన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. డిసెంబరు నాటికి పనులు పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ఉదయవాడ ప్రాంతంలో సబ్‌స్టేషన్ నిర్మాణం, ఒట్టియంబాక్కం, పెరుంబాక్కం, మేడవాక్కం, పల్లిక్కరణై, వేళచ్చేరి, ఆదంబాక్కం, ఆలందూర్ మీదుగా గిండి వరకు జరుగుతున్న పనులు కూడా సుమారు 90 శాతం పూర్తయినట్లు ఆయనకు అధికారులు వివరించారు. ఈ పథకం అందుబాటులోకివస్తే దక్షిణ చెన్నై ప్రాంతంలో విద్యుత్ కొరత ఉండదని ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మీడియాకు వివరించారు.

కేవీబీ చీఫ్ మేనేజర్‌కు రూ.25వేల జరిమానా

పెరంబూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) చీఫ్ మేనేజర్ శ్రీనాద్ కుమార్‌కు రూ.25వేల జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేసింది. బ్యాంక్ రుణం చెల్లించిన తర్వాత కూడా తాకట్టు పెట్టిన పత్రాలు తిరిగిచ్చేందుకు నిరాకరిస్తున్నారని హైకోర్టు మదురై బెంచ్‌లో బాధితుడు పిటిషన్ వేశాడు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, రుణం చెల్లించినా పత్రాలు తిరిగివ్వకపోవడాన్ని ఖండించింది. లబ్ధిదారుడు ఇంటికే వెళ్లి తాకట్టుపెట్టిన అన్ని పత్రాలను ఈ నెల 17వ తేదిలోగా అందజేయాలని ఆదేశిస్తూ, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేవీబీ చీఫ్ మేనేజర్‌కు రూ.25వేల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న మరణాలు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకాలంలో వైద్యం అందక మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రవ్యాప్తంగా వున్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు సహా పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీర్చకుండా డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ నాలుగేళ్లలో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరి మరణించిన వారి సంఖ్య బాగా పెరిగిందన్నారు. తిరునల్వేలి ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ లేక, అక్కడున్న సహాయకుడు వేసిన ఇంజక్షన్ వల్ల 4ఏళ్ల బాలుడు మృతి చెందడం దిగ్భ్రాంతి కలిగించిందని, ఆ బాలుడు కుటుంబానికి ఆర్థిక సాయం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించిన డీఎంకే ప్రభుత్వ బిడ్డ ప్రాణాలను ఎందుకు కాపాడలేకపోయిందని అన్నామలై ప్రశ్నించారు.

సైకోపై బీఎన్ఎస్ 92 సెక్షన్ కేసు

● రాష్ట్రంలోనే తొలిసారి

అడయార్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జోలార్‌పేట సమీపంలో రైలు నుంచి గర్భిణిని కిందికి తోసివేసిన కేసులో నిందితుడు హేమరాజ్‌పై పోలీసులు బీఎన్ఎస్ 92 సెక్షన్ (గర్భస్థ శిశువు హత్య) కింద కేసు నమోదు చేశారు. ఈ తరహా కేసు రాష్ట్రంలో నమోదు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నెల 6వ తేదీ జరిగిన ఈ ఘటనలో బాధితురాలిని ఏపీలోని చిత్తూరుకు చెందిన మహిళగా గుర్తించారు. ఆమె జోలార్‌పేటకు రైలులో వస్తుండగా వేలూరు జిల్లా గుడియాత్తం ప్రాంతానికి హేమరాజ్ అనే సైకో ఆమెను కదులుతున్న రైలు నుంచి కిందకు తోసివేయడంతో బాధితురాలు గాయపడింది. దీనిపై జోలార్‌పేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి హేమరాజ్‌ను అరెస్టు చేసి వివిధ సెక్షన్లను బనాయించారు.తాజాగా బీఎన్ఎస్ 92 సెక్షన్‌ను నమోదు చేశారు.

మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వ సాయం



మృతుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి ఆర్.గాంధీ

తిరుత్తణి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గత నెల 23వ తేదీ తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలోని వెడియంగాడులో విద్యుత్ లైన్‌ను రిపేరు చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కిన ఉద్యోగి రఘుపతి (25) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఆ సమయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అతని కుటుంబానికి రూ.10లక్షల పరిహారాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును గురువారం ఉదయం మంత్రి ఆర్.గాంధీ మృతుడి కుటుంబానికి అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌తో అందరికీ లబ్ధి

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరాటే త్యాగరాజన్



కార్యక్రమంలో పాల్గొన్న కరాటే త్యాగరాజన్

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంటులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టినబడ్జెట్ అందరికీ లబ్ధి చేకూర్చేదని, దీనిని ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరాటే త్యాగరాజన్ పేర్కొన్నారు. మహాకవి భారతినగర్‌లో గురువారం రాత్రి బీజేపీ ఉత్తరచెన్నై జిల్లా అధ్యక్షుడు ఎస్ఎల్.నాగరాజు నేతృత్వంలో 2025కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ సభ జరిగింది. ఇందులో జిల్లా నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మద్రాస్ పోర్ట్ ట్రస్టు మాజీ చైర్మన్ ప్రకాష్, ఏఎస్ఎస్ ప్రసాద్ తదితరులు కూడా పాల్గొన్నారు.



చిత్ర నిర్మాతలతో హీరో ప్రదీప్ రంగనాథన్

చిత్రపరిశ్రమ నుంచి తప్పుకుంటా

● దర్శకుడు మిష్కిన్

త్వరలోనే చిత్రపరిశ్రమ నుంచి తప్పుకుంటానని దర్శకుడు మిష్కిన్ అన్నారు. ఏజీఎస్ సంస్థ నిర్మించిన తాజా చిత్రం 'డ్రాగన్'. ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్, కయదు లోహర్ హీరోహీరోయిన్లుగా నటించారు. మిష్కిన్, కేఎస్ రవికుమార్, గౌతం వాసుదేవ్ మేనన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 21వ తేదీ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నగరంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇందులో చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. దర్శకుడు మిష్కిన్ "బ్యాడ్‌గర్ల్' మూవీపై జరుగుతున్న వివాదంపై స్పందించారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించింది ఒక యువతి. కేవలం ట్రైలర్ చూసి సినిమాపై నిషేధం విధించాలంటూ డిమాండ్ చేయడం భావ్యంకాదు. పైగా, ఒక యువతి తెరకెక్కించిన సినిమా విడుదలకాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. సినిమాలో ఉండేవారంతా రాజకీయ నేతలతో మాట్లాడి, సెన్సార్ సమయంలో ఆ చిత్రంలోని అసభ్యకర సన్నివేశాలన్నీ తొలగించి సినిమా రిలీజ్ చేసేందుకు కృషి చేయాలి. చిత్రపరిశ్రమలో మహిళా దర్శకులు ఉండటం ఎంతో ముఖ్యం' అని పేర్కొన్నారు. ఆ తర్వాత హీరో, హీరోయిన్లతో పాటు చిత్రంలో నటించిన నటీనటులు తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'ఇదయం మురళి'గా అధర్వ

హీరో అధర్వ మురళి 'ఇదయం మురళి'గా ప్రేక్షకుల ముందుకురానున్నారు. అధర్వ తండ్రి దివంగత హీరో మురళి నటించిన 'ఇదయం' (తెలుగులో 'హృదయం') మూవీ ఘన విజయం సాధించడంతో పాటు అతని కెరీర్‌లో ఓ మంచి చిత్రంగా మిగిలిపోయింది. ఇపుడు అదే పేరుతో మురళి తనయుడు 'ఇదయం మురళి'గా ప్రేక్షకుల ముందుకురానున్నారు. ఈ టైటిల్, ఫస్ట్‌లుక్ రిలీజ్ నగరంలో గురువారం రాత్రి జరిగింది. డాన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత ఆకాష్ భాస్కరన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తున్నారు. 'ఇదయం మురళి' మూవీలో అధర్వ, ప్రీతి ముకుందన్, కయదు లోహర్, నట్టి, తమన్, నిహారిక, రక్షన్, డ్రావిడ్, ఏంజెల్, పగ్యా నక్రా, సుధాకర్, యువశ్రీ తదితరులు నటిస్తున్నారు. ఎస్.తమన్ సంగీతం అందించే ఈ చిత్రం టైటిల్ రిలీజ్ వేడుకలో హీరో అధర్వ మురళి మాట్లాడుతూ, 'చాలాకాలం తర్వాత ఓ ప్రేమకథలో నటిస్తున్నాను. లవర్స్ డే ఒక రోజు ముందు విద్యార్థుల సమక్షంలో ఈ టైటిల్, ఫస్ట్‌లుక్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్ర టైటిల్ నా తండ్రి జ్ఞాపకార్థంగా ఉన్నప్పటికీ, ఆ ఉద్దేశ్యంతో పెట్టలేదు. కథకు అనుగుణంగానే సినిమా టైటిల్ ఎంపిక చేశారు. 'ఇదయం మురళి' అనేది ఒక ప్రత్యేక క్యారెక్టర్ సినిమా కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఒక ఇదయం మురళి ఉన్నారన్న విషయాన్ని తెలియజేసేందుకే ఈ సినిమా. నేను ప్రతి సినిమాకు చాలా గ్యాప్ తీసుకుంటున్నట్టుగా చెబుతున్నారు. నా దృష్టిలో అలాంటిది ఏమీలేదు. వరుస చిత్రాల్లో నటిస్తూనే ఉన్నాను. ఇక నుంచి నా కొత్త ప్రాజెక్టుల ప్రకటనలో వెల్లడవుతాయి. ఈ లవర్స్ డే రోజున యువతీ యువకులకు ఒక విషయం చెపుతున్నా.. మీకు నచ్చిన అమ్మాయి లేదా అబ్బాయిని ప్రేమించండి. ఆ ప్రేమ సక్సెస్ కావొచ్చు లేదా ఫెయిల్ కావొచ్చు. కానీ, జీవితంలో ప్రేమ ఎంతో ముఖ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోండి' అన్నారు.



ప్రీతి ముకుందన్, అధర్వ, కయదు లోహర్

తమిళ చిత్రజ్యోతి

ఆరెంజ్ చీరలో అందాల ఆరబోత

● ఆకట్టుకున్న మీనాక్షి స్టిల్స్

అగ్రహీరో విజయ్ నటించిన 'ది గోట్' మూవీలో నటించి తమిళ ప్రేక్షకులకు పరిచయమైన యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి. ఈ సినిమాలో ఆమె నటనకు పెద్దగా ప్రాధాన్యత లేకపోయినప్పటికీ గ్లామర్‌కు మంచి మార్కులుపడ్డాయి. ఆ తర్వాత దీపావళికి వచ్చిన 'లక్కీభాస్కర్'తో కోలీవుడ్ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అలాగే, గత నెలలో తెలుగులో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఘన విజయం సాధించడంతో మీనాక్షి ఇమేజ్‌తో పాటు క్రేజ్ కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో మున్ముందు మంచి పాత్రలను ఎంచుకుని ముందుకుసాగాలన్న కృతనిశ్చయంతో ఉంది. ముఖ్యంగా కోలీవుడ్‌లో 'ది గోట్' మూవీ నేర్పిన గుణపాఠంతో తమిళ చిత్రాల పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అదేసమయంలో తనకు లభించిన ఖాళీ సమయాల్లో విహారయాత్రలకు వెళ్ళి ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా దుబాయ్ ట్రిప్‌లో ఉన్న ఆమె... ఆరెంజ్ రంగు చీరలో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.





'కుడుంబస్థన్' చిత్ర బృందంతో కమల్ హాసన్

'కుడుంబస్థన్' బృందానికి కమల్ ప్రశంస

తాజాగా విడుదలైన చిత్రాల్లో 'కుడుంబస్థన్' మంచి విజయాన్ని సొంతం చేసుకుని, చిత్ర ప్రముఖుల ప్రశంసలను పొందుతుంది. ఈ కోవలోనే అగ్రనటుడు కమల్ హాసన్ ఈ సినిమా చూసి చిత్ర బృందాన్ని ఎంతో మెచ్చుకున్నారు. అంతేకాకుండా వారిని ఆహ్వానించి అభినందించారు. గత నెల 24వ తేదీ విడుదలైన ఈ మూవీ మంచి కలెక్షన్లతో ఇంకా ప్రదర్శితమవుతోంది. మణికంఠన్, సాన్వి మేఘన జంటగా నటించగా, గురు సోమసుందరం, ఆర్.సుందరరాజన్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటివరకు రూ.20 కోట్లకుపైగా వసూలు చేసింది.. ఈ నేపథ్యంలో ఇటీవల అమెరికా నుంచి నగరానికి తిరిగివచ్చిన కమల్ హాసన్ పలువురు సినీ రాజకీయ ప్రముఖులను కలుసుకుంటూ బిజీబిజీగా ఉన్నారు. తాజాగా 'కుడుంబస్థన్' యూనిట్ సభ్యులను ఆయన అభినందించారు.

మార్చిలో 'విక్టోరియా హాల్' పునఃప్రారంభం



చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ రాజసానికి, మద్రాస్ నగర వైభవానికి, చెన్నై విస్తరణకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన 'విక్టోరియా హాల్' వచ్చే నెల నుంచి ప్రజల సందర్శనకు సిద్ధమవుతోంది. చెన్నై సెంట్రల్ - కార్పొరేషన్ భవనం మధ్య వున్న ఈ మహల్ సందర్శకుల కోసం ముస్తాబు చేస్తున్నారు. ఈ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. 2023 నుంచి మరమ్మతులు చేస్తున్న విషయం తెలిసిందే. ఎక్కడా 'ఒరిజినాలిటీ' దెబ్బతినకుండా, పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం 'సింగార చెన్నై 2.0' పథకంలో భాగంగా రూ.32.6 కోట్లు కేటాయించింది. దీంతో మహల్ మరమ్మతు పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయి. ఇందులో భాగంగా మరో పది రోజుల్లో భవనం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లు వెలగనున్నాయి. ఈ భవనం భారీ భూకంపాలను సైతం తట్టుకుని నిలబడేలా పటిష్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే మహల్ ప్రధాన హాలు సిద్ధం కాగా, భవనంలో వున్న చెక్క తలుపులు, కిటికీలు కూడా పునరుద్ధరించారు. ప్రస్తుతం తుదిమెరుగులతో పాటు ఏసీ ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ భవనంలోని చెక్క మెట్లను తీసేసిన కార్మికులు, ఇనుప మెట్లు అమరుస్తున్నారు. ఇవి పూర్తయితే సందర్శకులు వంద మెట్లు ఎక్కి గాజు కిటికీల నుంచి విశాల నగరాన్ని వీక్షించవచ్చు. తొలి అంతస్తులో సమావేశ మందిరం, వివిధ ఫంక్షన్లకు అనువుగా హాలు, కింది అంతస్తులో మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు. 1840 ప్రాంతంలో నిర్మించిన ఈ హాల్.. 1915లో మరమ్మతులు చేసుకుని పునఃప్రారంభమైంది. అప్పట్లో ప్రముఖ బిల్డర్ అయిన నంబరుమాళ్ చెట్టి దీనిని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. విక్టోరియా రాణి పేరుతో వున్న ఈ హాల్‌ను ఆదిలో పబ్లిక్ టౌన్ హాల్‌గా పిలిచేవారు.





17 నుంచి పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో టీటీడీ ఆధ్వర్యంలోని పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుండి ప్రారంభమవుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 16 ఉదయం 9 నుండి 11.30 గంటల వరకు కుంకుమార్చన, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు విశ్వక్సేన ఆరాధన అంకురార్పణ చేస్తారు. ఈ ఉత్సవాలలో ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు, మళ్ళీ రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వివిధ వాహనాల్లో అమ్మవారు ఊరేగనున్నారు. ఆ మేరకు ఈ నెల 17 ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిన్న శేషవాహన సేవ జరుగుతాయి. 18 ఉదయం పెద్ద శేషవాహనం, రాత్రి హంసవాహనం, 19 ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనంలో అమ్మవారు ఊరేగనున్నారు. ఇదే విధంగా ఈ నెల 20 ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి హనుమద్ వాహనం, 21 ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి గజవాహనం, 22 ఉదయం సర్వభూపాలవాహనం, రాత్రి గరుడవాహనంలో అమ్మవారు విహరించనున్నారు. ఈ నెల 23 ఉదయం సూర్యప్రభవాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంలో అమ్మవారు విహరించనున్నారు. 24 ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ 25 ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం జరుగనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుండి 24 వరకు ఉదయం 11.30 నుండి ఒంటి గంట దాకా స్నపన తిరుమంజనం, ఈ నెల 17 నుంచి 20 దాకా 23న సాయంత్రం 5 నుండి 6 వరకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. ఇదే విధంగా ఈ నెల 17 నుంచి 20 దాకా రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సంగీత కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



● సముద్రతీరాల్లో ప్రేమజంటల కోలాహలం ● కళకళలాడిన పర్యాటక ప్రాంతాలు ● రాష్ట్రమంతటా వాలెంటైన్స్ డే సందడి

ప్యారీస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) 'వేలంటైన్స్ డే' సందర్భంగా సముద్రతీరాలు, పర్యాటక ప్రాంతాలు, పార్కులు ప్రేమికులతో కళకళాడాయి. ప్రేమికులు మాత్రమే కాకుండా పలువురు తమను అభిమానించే వ్యక్తులకు బహుమతులిచ్చి తమ ఆప్యాయతను తెలియజేసుకున్నారు. వాలైంటెన్స్ డే సందర్భంగా శుక్రవారం మెరీనా బీచ్‌లో ఉదయం 8గంటల నుండి రాత్రి 7గంటల వరకు ప్రేమజంటలు సరదాగా గడిపారు. అదేవిధంగా నగరంలోని కాశిమేడు, పట్టినంబాక్కం, శ్రీనివాసపురం సముద్రతీరాల్లో ప్రేమజంటలు తిరిగాయి. ఇక హోటళ్లు, సినిమా హాళ్లు, పార్కులు ప్రేమజంటలతో కిటకిటలాడాయి. వండలూరు జూ, కోవలం, మహాబలిపురం తదితర ప్రముఖ పర్యాటక కేంద్రాలు ప్రేమికులతో కళకళలాడాయి. ప్రేమజంటలను ఆహ్వానించేలా రిసార్ట్‌లు, షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు, మల్టీప్లెక్స్ థియేటర్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వాలెంటైన్స్ డే గుర్తులు, గులాబీలు ప్రేమజంటల కటౌట్‌లతో వేదిక ప్రాంగణాలను సుందరంగా అలంకరించారు. గిఫ్ట్, ఫ్యాన్సీ షాపులు, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, పూల దుకాణాల్లో గతం కంటే ఈ ఏడాది అమ్మకాలు తృప్తికరంగా వున్నాయని వ్యాపారులు హర్షం వ్యక్తంచేశారు. నీలగిరి జిల్లాలోని ఊటీ రోజ్ గార్డెన్‌లో ప్రేమజంటలు విహరించాయి. కొడైకెనాల్, సేలం జిల్లాలోని ఏర్కాడు హిల్స్, కన్నియాకుమారి ప్రాంతంలోని పర్యాటక స్థలాల్లో ప్రేమజంటల సందడి కనిపించింది.



రూ.350 కోట్లతో 27 అంతస్థుల సెంట్రల్ టవర్

● సీఎం శంకుస్థాపన

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపం సెంట్రల్ స్క్వేయర్ ప్రాంతంలో రూ.350 కోట్లతో 27 అంతస్థులతో నిర్మించనున్న బహుళ ప్రాయోజిత భవన సముదాయం 'సెంట్రల్ టవర్'కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. చెన్నై మెట్రో ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సంస్థ సెంట్రల్ రైల్వేస్టేషన్, పార్కు రైల్వేస్టేషన్, సబర్బన్ రైల్వేస్టేషన్, సెంట్రల్ రైల్వేస్టేషన్, రిప్పన్‌భవనం, జీహెచ్ తదితర ప్రాంతాలకు నగరవాసులు సులువుగా నడిచి వెళ్లే విధంగా ఈ సెంట్రల్ టవర్ నిర్మించనుంది. ఆ సంస్థ ఆధ్వర్యంలో సచివాలయంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఈ బహుళ అంతస్థుల భవనసముదాయానికి శంకుస్థాపన చేశారు. చెన్నై మెట్రో ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సంస్థ, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ 50:50 నిష్పత్తిలో ఈ భవన సముదాయ నిర్మాణానికి అవసరమైన వ్యయభారాన్ని భరిస్తాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రత్యేక ప్రయత్నాల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే గోపాల్, చెన్నై మెట్రోరైలు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి. అరుణ్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెంట్రల్ టవర్‌కు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

బీసీ, మైనారిటీల శాఖ భవనాల ప్రారంభం..

రాష్ట్ర బీసీ, ఓబీసీ, మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో మదురై, తేని జిల్లాల్లో రూ.8.93 కోట్లతో నిర్మించిన బాలనేరస్థుల పాఠశాల అదనపు భవనాలు, ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం, ప్రయోగశాల భవన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. పుదుకోట జిల్లా, కృష్ణరాజపట్టినం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో రూ.97.87 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం సహా పలు భవనాలను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్ఎం నాజర్, సీవీ మెయ్యానాథన్, బీసీ, ఓబీసీల మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.విజయరాజ్‌కుమార్, కమిషనర్ వి. సంపత్, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ ఎం. ఆసియా మరియం తదితరులు పాల్గొన్నారు.

రూ.120.54 కోట్లతో ఉన్నతవిద్యాశాఖ భవనాలు...

రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో రూ.120.54 కోట్లతో నిర్మించిన భవనాలకు కూడా ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. కోవై, రామనాథపురం, కృష్ణగిరి, సేలం, పుదుకోట, తిరుచ్చి, తంజావూరు, మైలాడుదురై, ధర్మపురి జిల్లాల్లో ప్రభుత్వ ఆర్ట్స్ సైన్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో నిర్మించిన తరగతి గదుల భవనాలు, ప్రయోగశాల భవనాలు, ఇండోర్ క్రీడా స్థలాలు, హాస్టల్ భవనాలు, కళాశాల భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సి. సమయమూర్తి, సాంకేతిక విద్యా కమిషనర్ జే ఇన్నోసెంట్ దివ్యా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఎ. సుందరవళ్ళి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న సీపీఎం అగ్రనేత ప్రకాష్ కారత్



17న నగరానికి మాతా అమృతానందమయి



చెన్నై, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాతా అమృతానందమయి ఈ నెల 17, 18 తేదీల్లో నగరంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా విరుగంబాక్కంలో వున్న బ్రహ్మస్థానం ఆలయ 35వ వార్షికోత్సవంలో పాల్గొంటారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు అమృతానందమయి మఠంలో జరిగే సత్సంగ్‌లో పాల్గొంటారు. 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు కరూర్‌లోని అమృత విద్యాలయం ప్రాంగణంలో జరిగే బహిరంగ కార్యక్రమంలో పాల్గొంటారు. వివరాలకు 044-23764063, 2376 4867 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

హొగెనకల్ జలపాతంలో పెరిగిన ఇన్‌ఫ్లో

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో వారం రోజులకు పైగా కురిసిన భారీ వర్షాలకు ధర్మపురి జిల్లాలోని హొగెనకల్ జలపాతంలోకి అదనపు జలాలు వచ్చిచేరుతున్నాయి. గత మూడు రోజులుగా ఆ జలపాతంలోకి సెకనుకు 700 ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించగా, శుక్రవారం ఉదయం ఆ పరిమాణం 1500 అడుగులకు పెరిగింది. దీంతో ప్రధాన జలపాతం, ఐందరువి, సినీఫాల్స్ తదితర జలపాతాలన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం కర్ణాటక - తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బిలిగుండ్లు వద్ద కేంద్ర నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు నిఘావేస్తూ కావేరి నదీ జలాల ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలనలు జరుపుతున్నారు.



హొగెనకల్ జలపాతంలో నీటి ఉధృతి



అమెరికాలో భారతీయులను అక్కడి ప్రభుత్వం సంకెళ్లు వేసి స్వదేశానికి తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ చెన్నై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్, సీపీఐ నేత ముత్తరసన్, తమిళగవాళ్వురిమై నేత వేల్మురుగన్ తదితరులు

'అంగే' నుంచి యువత మనసు దోచే చీరలు

చెన్నై, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'అంగే' నుంచి యువత మనసు దోచే చీరలు అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ ప్లాట్‌ఫారంలో ప్రసిద్ధ చీరల దుకాణంగా పేరొందిన అంగే యువతతో పాటు అన్ని వర్గాల వారికి ఆకర్షణీయంగా లక్ష్యం నిర్దేశించుకుంది. తేలికైన, పారదర్శకమైన, సొగసైన ఆకర్షణకు సమకాలీన అభిమానంగా మారాయి. ఇక్కడ విభిన్న రుచుల వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు నిర్వాహకులు అనితా జార్జ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత, చేతివృత్తుల చీరలను అందించడం ద్వారా, వారికి అండగా నిలుస్తోంది.





ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.120.54 కోట్లతో నిర్మించిన విశ్వవిద్యాలయ, హాస్టల్ భవనాలు, తరగతి గదులను శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్, పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





జస్టిస్ వెంకటేష్ నాయక్ - వరదరాజుల రెడ్డి


వెంకన్న దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793





ప్రకృతి ఒడిలో సదాశివుడు


● అటు ఆధ్యాత్మికత..ఇటు ప్రకృతి రమణీయత

వడమాలపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన జలపాతాలు, కొండ కోనల్లో సదాశివుని ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. తిరుపతి జిల్లా వడమాలపేట సమీపంలోని సదాశివకోనలో వెలసిన ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. చుట్టూ ప్రకృతి అందాలు పరుచుకోవడంతో పర్యాటక కేంద్రంగా కూడా ఆలయప్రాంతం భాసిల్లుతోంది. పర్వదినాల్లో సమీప పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు సైతం ఇక్కడకు వస్తుంటారు. జలపాతంలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటారు. జలపాత స్నానం చేశాక తడిదుస్తులతో ప్రదక్షిణ చేసి స్వామిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని దంపతులు విశ్వసిస్తారు. సదాశివకోన సమీపంలోనే కామాక్షి అమ్మవారి కోన ఉంది. మహామునులు పౌర్ణమి అమృత ఘడియల్లో జలపాత స్నానం చేసి గుహ ద్వారా శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుడ్ని దర్శించేవారని ఐతిహ్యం. శివరాత్రి, చిత్రాపౌర్ణమి, నవరాత్రులు,పౌర్ణమి తదితర వేడుకలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

మహాశివరాత్రి ఏర్పాట్లు

శివరాత్రి సందర్భంగా చైర్మన్ జయచంద్రన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. వేకువజామున లింగోద్భవ అభిషేకం అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు. సులభ దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యయ ప్రయాసలతో చేరుకునే భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. వడమాలపేట, పుత్తూరు, ఏర్పేడు మండలాల అన్నదాన సమాజాలు ఈ సేవలో తరిస్తాయి.





సదాశివకోనలో శివాలయం



సదాశివకోన జలపాతం



అమ్మవారి కోన జలపాతం

రాయలు నాటి శాసనం

సదాశివకోనలో బండమీద క్రీ.శ. 1554 నాటి శాసనం కనిపిస్తుంది. సదాశివకోనలో చెరువు తవ్వించిన అంశం, గుడిమల్లం పరశురామేశ్వరుడికి సంబంధించిన దానం ఈ శాసనంలో లిఖితమై ఉంది. శ్రీవీరప్రతాప వీర సదాశివదేవరాయలు తరఫున స్థానిక అధికారి(కార్యకర్త)గా పనిచేస్తున్న నరసింహ ఈ శాసనాన్ని వేయించారు. పాయల్ సెంటర్‌కి 15 కిలోమీటర్ల దూరంలో అడవిలో అమ్మవారి కోనతో ఒక బండమీద ఈ శాసనం ఉంది. తెలుగులో ఉన్న ఈ శాసనం మీది అక్షరాలు కనుమరుగవుతున్నాయి. దీని విలువ తెలియక రంగులు పూసేస్తున్నారు.



ఆలయానికి ఇలా వెళ్లాలి..

- వడమాలపేటకు సమీపంలో రామసముద్రం బైపాస్ నుంచి ఎనిమిది కిలోమీటర్లు కాలినడక మార్గం
- పుత్తూరు నుంచి బస్సుల ద్వారా నాగిలేరు, అక్కడ నుంచి కోనకు ఆరు కిలోమీటర్లు నడకమార్గం.
- ఏర్పేడు మండలం పాయల్ సెంటర్ నుంచి జీపులు, ట్రాక్టర్లు, మోటర్ బైక్‌ల ద్వారా 12 కిలోమీటర్లు ప్రయాణించాలి.



అమ్మవారి కోన లో బయల్పడిన పురాతన శాసనం

ద్రావిడ పాలన భేష్..!

- రాష్ట్రంలో డీఎంకే కూటమికి పెరిగిన ప్రజాదరణ
- 52 శాతం మంది సంతృప్తికరం
- అన్నాడీఎంకే,టీవీకే, బీజేపీ కలిస్తే 'ఇండియా'కు అడ్డుకట్ట
- సర్వేలో వెల్లడి

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే కూటమికి 52 శాతం మేర ప్రజాదరణ పెరిగిందని 'ఇండియా టుడే - సి ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్' నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఆ సర్వే ప్రకారం రాష్ట్రంలో డీఎంకే నాయకత్వంలోని ఇండియా కూటమికి 5 శాతం ఓటు బ్యాంక్ పెరిగింది. అదే విధంగా బీజేపీ కూటమి ఓటు బ్యాంక్ కూడా 3 శాతం అధికమైంది. ఇక ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే కూటమి ఓటు బ్యాంక్ 3 శాతం తగ్గింది. గత యేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో డీఎంకే కూటమికి 47 శాతం ఓట్లు పొందింది. బీజేపీ నాయకత్వంలోని కూటమికి 18 శాతం ఓట్లు, అన్నాడీఎంకే కూటమికి 23 శాతం ఓట్లు పడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఏ కూటమి ఎంత శాతం ఓట్లు, ప్రజాదరణ పొందుతున్న అంశాలపై ఆ సంస్థలు జరిపిన సర్వేలో ఆసక్తికరమైన ఫలితాలు వెలువడ్డాయి. డీఎంకే కూటమి ఓటు బ్యాంక్ 5 శాతం అధికమై 52కి చేరుతుందని, బీజేపీ కూటమి ఓటు బ్యాంక్ 3 శాతం అధికమై 21కి చేరుతుందని ప్రకటించారు. అన్నాడీఎంకే కూటమి ఓటు బ్యాంక్ 23 నుండి 20 శాతానికి తగ్గుతుందని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి పొందిన ఫలితాలే పునరావృతమవుతాయని ప్రకటించారు. డీఎంకే 22 ఎంపీ సీట్లు, కాంగ్రెస్ 9 సీట్లలో గెలుస్తాయని తెలిపారు. అన్నాడీఎంకేకి, బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని ఆ సర్వేలో స్పష్టం చేశారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం, అన్నాడీఎంకే, బీజేపీ కలిసి మెగా కూటమి ఏర్పాటు చేస్తే డీఎంకే దూకుడుకు అడ్డుకట్ట వేయగలరని ఆ సర్వేలో వివరించారు.



ఔటర్ రింగురోడ్డు టూ పాపవినాశనం

తిరుమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు రూ.40 కోట్లతో ఔటర్‌రింగు రోడ్డు నుంచి పాపవినాశనంకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి టీటీడీ పూనుకుంది. పాపవినాశనం తీర్థం, ఆకాశగంగ, జపాలి అంజనేయస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయాలకు వెళ్లాలంటే నందకం సర్కిల్ లేదా ఆక్టోపస్ భవనం ముందు నుంచి గోగర్భం డ్యాం మీదుగా వెళ్లాలి. గోగర్భం డ్యాం నుంచి పాపవినాశనం వరకు రెండు లైన్ల రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశేష పర్వదినాలు, వారాంతాల్లో సర్వదర్శన క్యూలైన్ ఆక్టోపస్ సర్కిల్ దాకా వ్యాపిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలతో సమస్యలు వస్తున్నాయి. ఇందుకు పరిష్కారంగా నాలుగు లేన్ల రహదారిని ప్రతిపాదించారు.



పాపవినాశన మార్గంలోని పార్వేటమండపం వద్ద రోడ్డు విస్తరణకు జరుగుతున్న సర్వే

● రూ.40కోట్లతో నాలుగు లేన్ల రహదారి

తొలి దశలో..

తొలిదశలో వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డంపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి మఠాల వరకు పాచికాల్వ ఉండటంతో వంతెన నిర్మించనున్నారు.

రెండో దశలో..

నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు ప్రస్తుతమున్న రెండు లైన్ల రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించే పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి సర్వే చేస్తున్నారు. ఆకాశగంగ నుంచి అటవీ భూములు కావడంతో అనుమతులు కోరారు.





ప్రత్యేక అలంకరణలో వాసవి అమ్మవారు

పెనుగొండ వాసవి ధామ్‌లో తమిళనాడు భక్తుల పూజలు

పెనుగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ వాసవి శాంతి ధామంలో తమిళనాడు సేలం నుంచి వచ్చిన వాసవి భక్తులు శుక్రవారం పూజలు చేశారు. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సేలం జిల్లా నుంచి సుమారు వెయ్యి మందికి పైగా వాసవి భక్తులు ప్రత్యేక రైలులో పెనుగొండ వచ్చారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మూలవిరాట్ నగరేశ్వర మహిషాసుర మర్ధిని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు, అభిషేకాలు, మాతంగి సేవ, మహాదీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవంలో పాల్గొన్నారు. తమిళనాడు ఆచారాలతో తంబతి పూజ నిర్వహించారు. ప్రత్యేక వాయిద్యాలు, ప్రత్యేక నాద బృందాలు ఆకర్షణగా నిలిచాయి. వాసవి మాతను ప్రత్యేకంగా అలంకరించి ప్రతిమలను ఏర్పాటు చేసి మహా చండీ హోమం చేశారు. మహాసభ చైర్మన్ వీఎస్.శ్రీనివాసన్, కార్యదర్శి ఎం. సురేంద్రన్, కోశాధికారి ఎస్.గోపాల మురుగన్, పీఆర్వో జె.ప్రభాకరన్, సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రతిమలు, కలశాలతో ప్రత్యేక పూజలు

టీటీడీ ఇళ్ల పట్టాల్లో

జగన్ బొమ్మ మాకెందుకు?

● ఉద్యోగుల్లో అసంతృప్తి

● శ్రీవారి చిత్రంతో కొత్తవి ఇచ్చే యోచనలో టీటీడీ

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటు పక్క తిరుమలలోని ఆనంద నిలయం, వేంకటేశ్వరస్వామి ఫొటో. అటువైపు జగన్ బొమ్మ చుట్టూ నవరత్నాల పేరుతో అందిస్తున్న పథకాలను ముద్రించారు. ఇదీ గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలోని చిత్రాలు. ఇలా, శ్రీవారితో సమానంగా అప్పటి సీఎం జగన్ ఫొటో ముద్రించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయినా అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పట్టించుకోలేదు. తమ ఇళ్ల పట్టాలకు సంబంధించి ప్రొసీడింగ్స్ కాపీపై జగన్ బొమ్మ ఎందుకంటూ టీటీడీ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు జగన్ బొమ్మను తీసేసి శ్రీవారి ఫోటోను ముద్రించి పాత ప్రొసీడింగ్స్ స్థానంలో కొత్తవి ఇచ్చే యోచనలో టీటీడీ ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. 5,350 మంది ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిపై అప్పటి సీఎం జగన్ బొమ్మను ముద్రించడంపై విమర్శలు వచ్చాయి. పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు సిద్ధమైన టీడీపీ నేతలను అప్పట్లో పోలీసులు హౌస్ అరెస్టు కూడా చేశారు. గతంలో అనేకసార్లు టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలు ఇచ్చినా.. ఎన్నడూ నేతల ఫొటోలు ముద్రించలేదు. కానీ, వైసీపీ హయాంలో సొమ్ము టీటీడీది, సోకు నాయకులది అన్న చందంగా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి తాము భూమి కొనుగోలు చేశామని, ఉచితంగా ఇవ్వలేదని, అలాంటప్పుడు ప్రొసీడింగ్స్‌పై జగన్ బొమ్మ ఎందుకని టీటీడీ ఉద్యోగులు గతంలోనే బాహాటంగా ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జగన్ బొమ్మలు ముద్రించారని విపక్షాలు ఆరోపించాయి. ఇప్పుడా జగన్ బొమ్మలను తొలగించి, శ్రీవారి ఫొటోలతో కొత్తగా ప్రొసీడింగ్స్ ఇచ్చే ఉద్దేశంతో టీటీడీ ఉన్నట్లు సమాచారం.

ఉత్సాహంగా మైలారు పండుగ

వి.కోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం జవ్వునిపల్లెలో మైలారు పండుగను శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు.యల్లమ్మ, గంగమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పశువుల పండుగను ప్రారంభించారు. గ్రామానికి తూర్పుదిశగా పశువులను పరుగులు పెట్టించారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన బారికేడ్ల మధ్య నుంచి పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున జనం తరలిరాగా ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి వందలాది ఎద్దులు ఈ పండుగలో పాల్గొన్నాయి. తమిళనాడులోని లత్తేరికి చెందిన ఎద్దుకు ప్రథమ బహుమతిగా రూ. 1.51 లక్షలు, ఏరుగుత్తికి చెందిన ఎద్దుకు రెండవ బహుమతిగా రూ. లక్ష, మూడవ బహుమతిగా వి.కోట మండలం చిన్నశ్యామ గ్రామానికి చెందిన ఎద్దుకు రూ.70 వేలు చొప్పున నిర్వాహకులు అందజేశారు. అలాగే పోటీల్లో సత్తాచూపిన 70 ఎద్దులకు కుక్కర్లు వంటి బహుమతులను వాటి యజమానులకు అందజేశారు.కాగా వి.కోట మండలం కృష్ణాపురానికి చెందిన ఓ ఎద్దు పండుగకు వచ్చి తప్పిపోయింది. దాని యజమాని ఎద్దు ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసి ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



పరుగులు తీస్తున్న ఎద్దును ఆసక్తిగా చూస్తున్న జనం

పోలీసులమని చెప్పి నగలు ఎత్తుకెళ్లారు !

భాకరాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని మాయమాటలు చెప్పిన గుర్తు తెలియని వ్యక్తులు ఓ జంట వద్ద బంగారు నగలు ఎత్తుకెళ్లిపోయిన ఘటన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలో చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. రొంపిచెర్ల మండలం గెర్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం శెట్టి భార్య భారతితో కలిసి ద్విచక్ర వాహనంలో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఎండపల్లెవారిపల్లె వద్దనున్న పెట్రోలు బంకు వద్ద వాహనాన్ని ఆపిన కొంత మంది తాము పోలీసులమని, బంగారు నగలు వేసుకుని ద్విచక్ర వాహనంలో తిరగడం ప్రమాదకరమని, నగలను తీసి భద్రంగా పెట్టుకోవాలని సూచిస్తూ ఒక పేపరు అందించారు. సుబ్రహ్మణ్యం శెట్టి తన చేతిలోని ఉంగరం, భార్య మెడలో ఉన్న బంగారు చైనును ఆ పేపర్‌లో చుట్టి పెట్రోలు ట్యాంకు కవర్‌లో పెట్టుకుంటూ ఉండగా తామే పొట్లం కట్టి ఇస్తామని తీసుకున్నారు. ఆ పొట్లాన్ని ట్యాంకు కవర్‌లో పెట్టినట్లు నటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన తర్వాత ట్యాంకు కవరును పరిశీలించిన సుబ్రహ్మణ్యం శెట్టి తాము మోసపోయినట్లు గ్రహించి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. 34 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భాకరాపేట పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పద్మావతి వర్సిటీలో ఏప్రిల్ 21నుంచి అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వీసీలు అప్పారావు, ఉమ, రిజిస్ట్రార్లు భూపతినాయుడు, రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా ఏప్రిల్ 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్స్ విత్ రేర్ ఎర్త్స్ అంశంపై ఎస్వీయూ ఫిజిక్స్ - పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ - రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ సదస్సు చేపట్టనున్నాయి. దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆవిష్కరించారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్‌పీ.రెడ్డి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.